క్లుప్తంగా

జితేందర్‌కు పురస్కారం


అవార్డు స్వీకరిస్తున్న జితేందర్

వేములవాడ: శిఖర ఆర్ట్స్ హైదరాబాద్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న ప్రతిభావంతులను రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసి ఈనెల 1న హైదరాబాద్ రవీంద్ర భారతిలో నంది ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ నేపథ్యంలో విద్యా రంగంలో ఉచితంగా సేవలందిస్తూ పేదలకు అండగా నిలుస్తున్న ఆయాచితుల జితేందర్‌రావుకు నంది ప్రతిభా పురస్కారం వరించింది. 17 ఏళ్లుగా వేములవాడ ప్రాంతంలో చాలా మంది పేద విద్యార్థులకు ఉచితంగా విద్యనందిస్తూ, వారి అభ్యున్నతికి కృషి చేశారని, విశిష్ట అతిథి దైవజ్ఞశర్మ, కథా రచయిత జేకే భార్గవి, రంగస్థల నటుడు ఉమామహేశ్వర్, ఆర్గనైజర్ ఉప్పులేటి నవీన్, విష్ణు, అశోక్, బాలకిషన్ కొనియాడారు. పురస్కారం అందుకున్న జితేందర్‌రావును పలువురు అభినందించారు.

ఎక్సైజ్ సీఐకి సన్మానం

ఎల్లారెడ్డిపేట: మండల ఎక్సైజ్ సీఐగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌ను మంగళవారం సర్కిల్ కార్యాలయంలో నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. అందరి సహకారంతో నేరాల నియంత్రణకు కృషి చేస్తానన్నారు. గుడుంబా, గంజాయి వంటి మత్తు పదార్థాల విక్రయాలపై తమకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాల్‌రాజ్, జిల్లా రెడ్డి సంఘంసభ్యులు నేవూరి శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు ప్రాధాన్యంపై సైకిల్‌యాత్ర

సిరిసిల్లకల్చరల్: ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు ప్రాధాన్యం గురించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పీవీ నరసింహారావు సేవా సమితి అధ్యక్షుడు, సామాజిక కార్యకర్త పిడిశెట్టి రాజు చేపట్టానికి సైకిల్‌యాత్ర మంగళవారం జిల్లా కేంద్రానికి చేరుకుంది. గ్రామాల్లో సైకిల్‌పై పర్యటిస్తూ ఓటు విలువ గురించి వివరిస్తున్నాడు. మంగళవారం చాకలి ఐలమ్మ చౌరస్తాకు చేరుకున్న రాజు మాట్లాడుతూ ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటుహక్కును వినియోగించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రజక సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు జాలిగం శ్రీధర్, సిలివేరు వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ సిద్ధోగం వేడుకలు



తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లిలో మంగళవారం ఎల్లమ్మ సిద్ధోగం వేడుకలు ప్రారంభమయ్యాయి. రేణుక ఎల్లమ్మ ఆలయానికి 800 ఏళ్ల చరిత్ర ఉందని గ్రామస్తులు తెలిపారు. అమ్మవారిని డప్పుచప్పుళ్లతో ఊరేగించి పుట్టకు దని పోశారు. అనంతరం గ్రామస్తులు బోనాలు సమర్పించారు. బుధవారం గావుపట్టుట, సిద్దులు తిరుగుట, అమ్మవారి కల్యాణం నిర్వహించనున్నట్లు ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ పుష్పలత

బోయినపల్లి: మండలంలోని కోరెం ప్యాక్స్ కేంద్రం ఆధ్వర్యంలో అనంతపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ పుష్పలత మంగళవారం ప్రారంభించారు. రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. ఆర్ఐ బాలయ్య, సీఈవో నరెడ్ల బాపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సింగిడి' పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న రంజిత్‌కుమార్, తదితరులు

సిరిసిల్లటౌన్: అఖిల భారత విద్యార్థి పరిషత్ రాష్ట్రీయ కళామంచ్ సింగిడి–2024 పోస్టర్‌ను ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్‌కుమార్ మంగళవారం సిరిసిల్లలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈనెల 20,21వ తేదీల్లో హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో జరిగే కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో దాగిన ప్రతిభను వెలికితీసి ప్రపంచానికి పరిచయం చేయడం జరుగుతుందన్నారు. నాయకులు పులి రంజిత్, లోపెల్లి రాజురావు తదితరులున్నారు.

బీఆర్ఎస్ నియంతృత్వ పాలనకు చరమగీతం

• ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్


ఆశిరెడ్డిపల్లెలో మాట్లాడుతున్న విప్ శ్రీనివాస్

చందుర్తి: బీఆర్ఎస్ నియంతృత్వ పాలనకు ప్రజలు చరమగీతం పాడారని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నా రు. మంగళవారం మండలంలోని ఆశిరెడ్డిపల్లె, తిమ్మాపూర్, రామన్నపేట గ్రామాల్లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తిమ్మాపూర్‌లో పలువురు యువకులు, మహిళలు కాంగ్రెస్‌లో చేరగా పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఈ ప్రాంత రైతుల సాగునీటి కష్టాలను పూర్తి స్థాయిలో తీర్చేందుకు ఆశిరెడ్డిపల్లె కొత్త చెరువును ఎల్లంపల్లి నీటితో నింపుతామని పేర్కొన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ హయాంలోనే ఫాజుల్‌నగర్ రిజర్వాయర్, రుద్రంగి నాగారం చెరువు నిర్మాణం పూర్తయిందని, ఆయన బతికి ఉంటే ఈ ప్రాంతంలో మరింత అభివృద్ధి జరిగేదని గుర్తు చేశారు. కాంగ్రెస్‌కు లభిస్తున్న ఆదరణ ఓర్వలేక కేటీఆర్, హరీశ్‌రావులకు మతిభ్రమించి మాట్లాడుతున్నారని అన్నారు. జెడ్పీటీసీ నాగం కుమార్, పొద్దుపొడుపు లింగారెడ్డి, రాంరెడ్డి, ముస్కు ముకుందరెడ్డి, ప్రభాకర్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్‌ను నమ్మే స్థితిలో లేరు'


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: రైతులపై మాజీ సీఎం కేసీఆర్ మొసలి కన్నీరు కారుస్తున్నారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణాలపై ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గతంలో వడగళ్ల వానలతో రైతులు పంటలు నష్టపోతే పరిహారం అందించలేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్క సీటు కూడా రాదని, తెలంగాణాలో బీఆర్ఎస్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, ఉపాధ్యక్షుడు పందిర్ల లింగంగౌడ్, నాయకులు బండారి బాల్‌రెడ్డి, గంట బుచ్చాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

సల్లంగా చూడు.. పోచమ్మ తల్లీ


డప్పు చప్పుళ్ల మధ్య బోనాలతో ఆలయానికి వెళ్తున్న మహిళలు

ముస్తాబాద్: మండలకేంద్రంలో మడేలేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పోచమ్మ బోనాలను ఘనంగా నిర్వహించారు. మహిళలు ఇంటికో బోనంతో డప్పుచప్పుళ్ల మధ్య, బైండ్ల కళాకారుల ఆటలు, శివసత్తుల పూనకాలతో అమ్మవారి ఆలయానికి తరలివెళ్లారు. అమ్మవారికి బోనా లు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. ఊరు వాడ చల్లంగా చూడాలని వేడుకున్నారు. అనంతరం సాయంత్రం ఆలయానికి సీతాలమ్మ బోనాలు తీసుకెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు శెరయ్య, బాలయ్య, సింగపూర్ సత్తయ్య, దీటి నర్సింలు, అంజయ్య, దేవయ్య, వెంకటి, రాములు తదితరులు పాల్గొన్నారు.

నేతన్నలకు మెరుగైన ఉపాధి కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

సిరిసిల్లటౌన్: సంక్షోభంతో కొట్టుమిట్టాడుతున్న సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను అన్ని విధాలా ఆదుకోవాలని తెలంగాణ పవర్‌లూమ్స్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూశం రమేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం చేనేత వస్త్ర వ్యాపార సంఘం భవనంలో ఏర్పాటు చేసిన పరిశ్రమ, అనుబంధాల ప్రతినిధుల రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడారు. నేత కార్మికులకు మెరుగైన ఉపాధి కల్పించి, త్రిఫ్ట్ పథకాన్ని అమలు చేయాలన్నారు. బతుకమ్మ యారన్ సబ్సిడీ డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలు, సవాళ్లను యజమానులు, ఆసాములు వివరించారు. పరిశ్రమ మనుగడ కోసం సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేలా అనుబంధ సంఘాల ఐక్యవేదికను 27 మందితో ఏర్పాటు చేసుకున్నారు. కార్మికులు, పరిశ్రమ సంక్షేమం కోసం సిరిసిల్లలో నేతన్నల గర్జన సభను పెద్దెత్తున నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జేఏసీ ప్రతినిధులు మంచె శ్రీనివాస్, కూరపాటి రమేశ్, పంతం రవి, రమణ, దామోదర్, మండల సత్యం, లక్ష్మీనారాయణ, మధు, రాజు, కోడం శ్రీనివాస్, రవీందర్, సిరిమల్లె సత్యం, ఆడెపు సంపత్, శ్రీనివాస్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి

• మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్


మాట్లాడుతున్న వినోద్‌కుమార్

కోనరావుపేట: కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణకు సాధ్యం కాని హామీలిచ్చి అబద్ధాల పునాదులపై ఏర్పాటైందని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. మండలంలోని సుద్దాల, కనగర్తి, నిమ్మపల్లి, బావుసాయిపేట గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశాల్లో మాట్లాడారు. అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటినా పూర్తిస్థాయిలో హామీలు అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేతగాని తనం వల్లే సాగునీరు లేక పంటలు ఎండుతున్నాయన్నారు. కరీంనగర్ ఎంపీగా ఉన్న బండి సంజయ్ ఐదేళ్ల కాలంలో ఐదు రూపాయలు కూడా తేలేదన్నారు. వేములవాడ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు మాట్లాడుతూ, పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్‌లో బీఆర్ఎస్ జెండా ఎగురవేయాలన్నారు. జెడ్పీచైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, ఎంపీపీ చంద్రయ్య, సింగిల్‌విండో చైర్మన్లు బండ నర్సయ్య, రాంమోహన్‌రావు, వైస్‌చైర్మన్లు అనుపాటి భూంరెడ్డి, మహేశ్, ఎంపీటీసీ లింగంపెల్లి లక్ష్మి, మల్లేశ్, మమత తదితరులు పాల్గొన్నారు.

టెట్ ఫీజు రద్దు చేయాలి

సిరిసిల్లటౌన్: రాష్ట్రంలో టెట్ ఫీజు రద్దుచేయాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బని హరీశ్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సీఎంకు పోస్టుకార్డులు రాసి నిరసన చేపట్టారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో టెట్ ఒక పేపర్‌కు రూ.200 ఉండేదన్నారు. ఇప్పుడు పెరిగిన రుసుముతో ఒక్క పేపర్‌కు రూ.1 వెయ్యి, రెండు పేపర్లు రాసేవారికి రూ. 2వేలు అవుతాయని, బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు మానాల అరుణ్‌కుమార్, సాయి, వెంకటరమణ పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి



వేములవాడ: వేసవి సందర్భంగా విద్యుత్ సమస్యలపై ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు సెస్ సిబ్బందికి సూచించారు. పట్టణంలోని మహాలక్ష్మీవీధి, కోనాయిపల్లి, మల్లారంరోడ్‌లో అత్యవసరంగా ఏర్పాటు చేయాల్సిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు, వినియోగదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఆయన వెంట సెస్ ఎండీ రమేశ్, ఏడీఈ శ్రీధర్, ఏఈ సిద్ధార్థ, సెస్ డైరెక్టర్ భర్తనామాల లక్ష్మీరాజం తదితరులున్నారు.

నగదు స్వాధీనం


నగదు స్వాధీనం చేసుకుంటున్న ఎస్సై మారుతి

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని వట్టెంల వద్ద పోలీసుల తనిఖీల్లో రూ. లక్ష పట్టుకున్నట్లు ఎస్సై మారుతి తెలిపారు. వేములవాడకు చెందిన రాజశేఖర్ జగిత్యాల నుంచి వట్టెంల మీదుగా వేములవాడకు వెళ్తున్నాడు. వట్టెంలలో పోలీసులు తనిఖీ చేపట్టగా రూ.లక్ష ఉన్నట్లు గుర్తించారు. స్వాధీనం చేసుకొని అధికారులకు అప్పగించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

తంగళ్లపల్లి: మండలంలోని జిల్లెల్ల శివారులో చెక్‌పోస్టు వద్ద నిర్వహించిన తనిఖీల్లో మంగళవారం రూ.93,500 అధికారులు పట్టుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన శ్యామ్ సుందర్ అగర్వాల్ హైదరాబాద్ నుంచి సిద్దిపేట వయా సిరిసిల్లకు కారులో వెళ్తున్నాడు. జిల్లెల్ల చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేపట్టగా పత్రాలు లేకుండా నగదును తరలిస్తున్నట్లు గుర్తించి సీజ్‌చేశారు.

బోయినపల్లి: కొదురుపాక చెక్‌పోస్టు వద్ద నిర్వహించిన తనిఖీల్లో రాత్రి రూ.59వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు చెక్‌పోస్టు సిబ్బంది తెలిపారు. కరీంనగర్ నుంచి సిరిసిల్ల వైపు వెళ్తున్న నారాయణఖేడ్‌కు చెందిన మాజీ సర్పంచ్ సాయిలు కారును తనిఖీ చేశారు. ఆధారాలు లేని రూ.59 వేలు నగదు లభించిందని పేర్కొన్నారు.

'ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే రైతుల ఆత్మహత్యలు'


మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే పంటలు ఎండి, రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి నెలకొందని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వరుస కృష్ణహరి, ఎంపీపీ పిల్లి రేణుక, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అందె సుభాశ్ అన్నారు. మండలకేంద్రంలోని జెడ్పీటీసీ కార్యాలయంలో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పంటలు ఎండిపోకుండా కేసీఆర్ సాగునీరు అందించారని గుర్తుచేశారు. రైతుబంధు, రుణమాఫీ, రైతుబీమా పథకాలను అమలుచేశారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలైనా రైతులను పట్టించుకోవడం లేదన్నారు. నా యకులు జబ్బార్, బాల్‌రెడ్డి, మీసం రాజు, రా జి రెడ్డి, లక్ష్మణ్, ప్రభునాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ విజయానికి కృషి చేయాలి


మాట్లాడుతున్న స్వామి

కోనరావుపేట: పార్లమెంట్ ఎన్నికల్లో బీఎస్పీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వర్దవెల్లి స్వామి అన్నారు. కోనరావుపేటలో మంగళవారం మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో 6 గ్యారెంటీల హామీ ఇచ్చి, పూర్తిగా నెరవేర్చలేదని, ఇప్పుడు ఎన్నికల్లో ఓట్లు ఎలా అడుగుతారని ప్రశ్నించారు. అలాగే మతవిద్వేషాలను రెచ్చగొడుతున్న బీజేపీని బొందపెట్టాలన్నారు. పార్టీలోకి ఎందరో నాయకులు వస్తారు, వెళ్తారని అలాంటి వారికోసం ఆందోళన చెందవద్దన్నారు. ఆయన వెంట జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రునాయక్, నాయకులు పల్లం సత్తయ్య, గసికంటి అరుణ్ తదితరులు ఉన్నారు.

డీఈవో అభినందన

సిరిసిల్లటౌన్: జవహర్ నవోదయ విద్యాలయ సమితి 2024–25 విద్యా సంవత్సరానికి నిర్వహించిన ప్రవేశ పరీక్షలో సిరిసిల్ల పత్తిపాక వీధిలోని సిద్ధార్థ ఇంగ్లిష్ మీడియం విద్యార్థిని ఎంపికైంది. అర్బన్ కేటగిరీలో పత్తిపాక నేహాకు సీటు రావడంతో పాఠశాల యాజమాన్యం, జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ అభినందించారు. అనంతరం ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ నాగుల సంతోష్‌గౌడ్, ప్రధానోపాధ్యాయులు బిజ్జు, మార్టిన్, సుధాకర్ తదితరులున్నారు

పాపన్నకు నివాళి


వేములవాడ: సర్వాయిపాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు


తంగళ్లపల్లి: జిల్లెల్లలో

వేములవాడ: వేములవాడ పట్టణంలోని సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. బహుజన రాజ్యస్థాపన కోసం ఆయన పోరాటాలు చేశారని నాయకులు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు నేరెళ్ల తిరుమలగౌడ్, ఉత్తర తెలంగాణ గౌడ సంఘం అధ్యక్షుడు సంపునూరి మల్లేశంగౌడ్, నాయకులు చంద్రగిరి శ్రీని వాస్ గౌడ్, పులి రాంబాబుగౌడ్, ఖైరి పర్శరాంగౌడ్, జవాజి రాజశేఖర్‌గౌడ్, ముంజ రమేశ్, సంపత్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

తంగళ్లపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో సర్దార్ పాపన్న విగ్రహానికి నాయకులు నివాళి అర్పించారు. సారంపల్లిలో మాజీ సర్పంచ్ కొయ్యడ రమేశ్ గౌడ్, జిల్లెల్లలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. మాజీ ఉపసర్పంచ్ పర్శరాములు, గౌడసంఘం గ్రామ అధ్యక్షుడు బాలమల్లుగౌడ్, ఎల్లయ్య, రాములు, అంజయ్య, పర్శరాములు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలకేంద్రంలో మండల గౌడసంఘం నాయకులు సర్దార్ సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మండల గౌడసంఘం అధ్యక్షుడు బొంగాని అశోక్, నాయకులు గంగాధర్, జలేందర్, రాజేశం, అనీల్, కమల్, శ్రీనివాస్, నారాయణ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: భవిష్యత్తులో పాపన్నగౌడ్ చరిత్రను తెలిపే విధంగా బహుజనులు పోరాటం చేయాలని, మండల గౌడ సంక్షేమ సంఘం గౌరవా అధ్యక్షుడు ముస్కం దత్తాద్రిగౌడ్ అన్నారు. మండలకేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం, చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మండల గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కార్తీక్‌గౌడ్, సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, నారాయణగౌడ్, సుధాకర్ గౌడ్, మల్లేశం, శ్రీధర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

'కేకేను విమర్శిస్తే సహించం'



తంగళ్లపల్లి(సిరిసిల్ల): గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు మధ్య ఏర్పడ్డ బేధాభిప్రాయాలతో సిరిసిల్ల ప్రాంత రైతులు సాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని ఆరోపించారు. మంగళవారం జిల్లెల్ల–సిద్దిపేట శివారులో నిర్మిస్తున్న కాలువను కాంగ్రెస్ బృందం పరిశీలించింది. కమీషన్ల కోసం తొమ్మిదో ప్యాకేజీ పనులు పక్కనబెట్టారని, 11వ ప్యాకేజీ పనులు కూడా పూర్తిచేయలేదని ఆరోపించారు. కేకేపై అవాకులు చెవాకులు మాట్లాడితే సహించేది లేదని బీఆర్ఎస్ నాయకులను హెచ్చరించారు. బతుకమ్మ చీరలపై వందల కోట్లు దోపిడీ చేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎంపీటీసీ బైరినేని రాము, సత్తు శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, శ్రీకాంత్ గౌడ్, పర్శరాములు, చెన్నమనేని ప్రశాంత్, భరత్ గౌడ్, సంజీవ్ గౌడ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా తయారు చేస్తే చర్యలు


బెల్లం పానకాన్ని పారబోస్తున్న ఎక్సైజ్ పోలీసులు

కోనరావుపేట: గ్రామాల్లో నాటు సారా తయారు చేసినా, విక్రయించినా తగిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ (కరీంనగర్) వరప్రసాద్ హెచ్చరించారు. కోనరావుపేట మండలం ఊరుతండా(నిమ్మపల్లి), గోవిందరావుపేటతండా (బావుసాయిపేట)లో మంగళవారం ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డిపేట, సిరిసిల్ల సీఐలు మిట్టపల్లి శ్రీనివాస్, పంచాక్షరి ఒకేసారి 5 వాహనాలతో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 10 లీటర్ల గుడుంబా, 800లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. గ్రామాలు, గిరిజన తండాల్లో నాటుసారా తయారీ, విక్రయాలకు గిరిజనులు దూరంగా ఉండాలన్నారు.

మద్యం దుకాణంపై కేసు

బోయినపల్లి: మండలకేంద్రంలోని మద్యం దుకాణంపై కేసునమోదు చేయడంతో పాటు, పర్మిట్ రూం నిర్వాహకుడిని బైండోవర్ చేసినట్లు సిరిసిల్ల ఎక్సైజ్ సీఐ ముస్తాఫా మంగళవారం తెలిపారు. సోమవారం తనిఖీ చేయగా, వైన్‌షాపుపై రేకుల షెడ్‌లో సిట్టింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిసిందని పేర్కొన్నారు. వైన్‌షాపుపై కేసు నమోదు చేసి వైన్‌షాప్ పర్మిట్ రూం నిర్వాహకుడిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. బైండోవర్ నిబంధనలు అతిక్రమిస్తే పెద్ద మొత్తంలో జరిమానా ఉంటుందని, వైన్‌షాపుపైన సిట్టింగ్ నిర్వహిస్తే చర్యలు తీసుకోనున్నట్లు సీఐ ముస్తాఫా హెచ్చరించారు.

ఓటుహక్కును వినియోగించుకోవాలి


5కే రన్‌ను ప్రారంభిస్తున్న ఆర్డీవో రాజేశ్వర్, డీఎస్పీ నాగేంద్రచారి

వేములవాడ/వేములవాడఅర్బన్: 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్ అన్నారు. వేములవాడ పట్టణంలోని తెలంగాణ చౌక్ నుంచి తిప్పాపూర్ బస్టాండ్ వరకు స్వీప్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 5కే రన్‌ను ఆర్డీవో, డీఎస్పీ నాగేంద్రచారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, ఓటరు హెల్ప్‌లైన్ యాప్ సేవలు, ఫారం 6 వినియోగం తదితర వివరాలు వెల్లడించారు. తహసీల్దార్ మహేశ్‌కుమార్, డీటీ శ్రావన్ తదితరులు పాల్గొన్నారు.

ఈఎంటీ దినోత్సవం


కేక్ కట్ చేస్తున్న 108 సిబ్బంది

సిరిసిల్లటౌన్: ఈఎంటీ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం 108 సిబ్బంది సిరిసిల్ల జనరల్ ఆస్పత్రి ప్రాంగణంలో కేక్ కట్‌చేసి వేడుకలు జరుపుకున్నారు. పెద్ది శ్రీనివాస్, సత్యసాగర్, అనిల్‌కుమార్, లక్ష్మణ్, శ్రీకాంత్, రాజశేఖర్, మదన్, సాయికృష్ణ, గణేశ్‌నాయక్, రాములు, గణేశ్ పాల్గొన్నారు.

శునకం ఆటకట్టు..



కోనరావుపేట: మండలంలోని నాగారంలో వాహనదారులపై ఎగబడుతున్న ఓ శునకానికి మెడలో తుంట కట్టారు. కొన్ని రోజులుగా గ్రామంలో ఒకుక్క వాహనదారులపై ఎగబడుతుండటంతో వారు భయపడుతున్నారు. దీంతో పశువుల మాదిరిగా కుక్కమెడలో తుంట (కర్రమొద్దు) కట్టారు. అప్పటినుంచి కుక్క వాహనాల వెంబడి పరుగెత్తడంలేదు. గ్రామస్తుల ఆలోచనతో వాహనదారులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

డే కేర్ కేంద్రానికి తప్పిపోయిన వృద్ధుడు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రానికి వచ్చి తప్పిపోయిన కొక్కుల నర్సయ్య (83)ను మంగళవారం రాత్రి మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాల్‌రాజ్‌యాదవ్ డే కేర్ కేంద్రానికి తరలించి నిర్వాహకులకు అప్పగించారు. బస్టాండ్ ప్రాంతంలో ఉండగా అక్కడున్న వారు బాల్‌రాజ్‌యాదవ్‌కు సమాచారం అందించారు. డే కేర్ కేంద్రానికి తరలించి కేంద్రం ఇన్‌చార్జి మమతకు అప్పగించారు. భోజన వసతి కల్పించి వివరాలు అడగగా..ఒగులాపూర్‌కు చెందిన వాసిగా చెబుతున్నాడు. వృద్ధుడి వివరాలకోసం 9059519691 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

వృద్ధుడికి తీవ్ర గాయాలు

చందుర్తి (వేములవాడ) : మర్రిగడ్డకు చెందిన ధారం రాజిరెడ్డి(60)మోపెడ్‌పై నుంచి పడి మంగళవారం రాత్రి తీవ్రగాయాలయ్యాయి. మర్రిగడ్డ శివారులోని పెట్రోల్ వద్ద నుంచి మోపెడ్‌పై ఇంటికి వస్తుండగా ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ వాహనాన్ని చూసి అదుపుతప్పి కిందపడిపోయాడు. రాజిరెడ్డికి గాయాలుకాగా చికిత్స కోసం వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు.